

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఫాల్కే అవార్డు అందుకున్న ప్రప్రథమ గీత రచయిత మజ్రూహ్ సుల్తాన్ పురి

### (విజయచిత్ర – 1994, జూలై సంచిక నుంచి )



ఫాల్కే అవార్డు అందుకున్న ప్రప్రథమ గీత రచయిత

సాహిత్య రంగంలో ఆయన 'శాయర్' (ఉర్దూకవి). హిందీ సినీ సంగీత రంగంలో 'గీత్ కార్' (పాటల రచయిత). అసలు పేరు అస్రద్ హుస్సేన్. కలం పేరు మజ్‌రూహ్ సుల్తాన్‌పురి (పలకడం 'మజ్రూ' అని పలికినా రాసినప్పుడు 'మజ్‌రూహ్' అనే రాస్తారు.)

దాదాపు అర్థ శతాబ్దంగా హిందీ సినీ సంగీత రంగంలో వెరైటీ పాటలకు మకుటం లేని మహారాజుగా పేరు ప్రఖ్యాతులు సాధించిన మజ్‌రూహ్ సుల్తాన్‌పురి ని భారత ప్రభుత్వం 1993 వ సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో గౌరవించింది.

ఫాల్కే అవార్డు 1969లో నెలకొల్పిన నాటి నుంచి ఇంత వరకు సినీ రంగానికి విశిష్ట సేవలు చేసిన దర్శక నిర్మాతలు, నటీ నటులు. సంగీత దర్శకులు, నేపథ్య గాయనీ గాయకులు మాత్రమే ఫాల్కే అవార్డు అందుకుంటూ వచ్చారు. ఐతే, ఫాల్కే అవార్డు అందుకుంటున్న ప్రప్రథమ గీత రచయిత మజ్‌రూహ్ సుల్తాన్‌పురి.

అనేక 'ముశాయిరా' (ఉర్దూ కవి సమ్మేళనం) లలో కవితలు వినిపిస్తూ 'గజల్' రచనలో ఆధునిక ప్రయోగాలు చేస్తూ 'శాయర్' గా పేరు ప్రఖ్యాతులు సాధిస్తూ ఉన్నరోజులలో మజ్‌రూహ్ సుల్తాన్‌పురి సినీ గీత రచయితగా మారడానికి సముఖంగా లేరు.

జిగల్ మురాదాబాదీ అనే మరో ప్రముఖ కవి మజ్‌రూహ్ సమకాలికుడు. 1945 లో ఎ.ఆర్.కార్దార్ 'షాజహాన్' అనే చిత్రానికి పాటలు రాయవలసిందిగా కోరినప్పుడు అతడు అందుకు అంగీకరించలేదు. ఒక ముశాయిరాలో మజ్‌రూహ్ కవిత్వం విన్న కార్దార్ 'షాజహాన్' చిత్రంలో పాటలు రాయవల్సిందిగా మజ్‌రూహ్ ను కోరారు ఆ రోజుల్లోనే ముశాయిరాలలో కవిత్వాలు వినిపించడం ద్వారా నెలకు రెండు మూడు వందల రూపాయలు అర్జిస్తున్న మజ్‌రూహ్ ముందు అంగీకరించక పోయినప్పటికీ ఆర్థిక అవసరాల కోసం ఒప్పుకున్నారు. అలా 1945 లో 'షాజహాన్' చిత్రంతో గీత రచయితగా హిందీ సినీరంగంలో ప్రవేశించిన మజ్‌రూహ్ ప్రముఖ దర్శక నిర్మాత మెహబూబ్ ఖాన్ సృష్టించిన 'అందాజ్' చిత్రంలో మరపురాని పాటలు రాశారు. ఆ విధంగా రొమాంటిక్ పాటల రచయితగా మజ్‌రూహ్ సుల్తాన్‌పురి తనదైన ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్నారు.

గజల్ తరహా గీతాలు మాత్రమేకాక అనేక అల్లరి చిల్లరి చిలిపి ప్రేమ గీతాలు రాసిన మజ్‌రూహ్ వెరైటీ పాటల రచనలో సాటిలేని మేటి అనిపించుకున్నారు.

ఎస్.డి.బర్మన్ సంగీత దర్శకత్వం వహించిన అనేక చిత్రాలలో, ఆ తర్వాత ఆర్.డి.బర్మన్ సంగీత దర్శకత్వం వహించిన అనేక చిత్రాలలో హిట్ సాంగ్స్ రాసిన గీత రచయిత మజ్‌రూహ్.

'ఎస్.డి. బర్మన్ సంగీత దర్శకత్వంలో 'పేయింగ్ గెస్ట్' వంటి చిత్రాలలో నేను రాసిన పాటలు బహుళ ప్రాచుర్యం పొంది ఎస్.డి. బర్మన్ కి ఎనలేని కీర్తి తెచ్చిపెట్టాయి. అయితే ఎస్.డి.బర్మన్ అగ్రశ్రేణి సంగీత దర్శకునిగా నిలదొక్కుకోడానికి నా పాటలు ఎంతో దోహదం చేశాయని చెప్పుకోలేను కాని, ఓ.పి.నయ్యర్, లక్ష్మీకాంత్ ప్యారేలాల్, ఖయ్యామ్, ఉషాఖన్నా, చిత్రగుప్త, ఆర్.డి.బర్మన్ వంటి సంగీత దర్శకులు నా పాటల వల్లే సంగీత దర్శకులుగా తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారని మాత్రం చెప్పగలను." అని ఒక దశాబ్దం క్రిందట ఒక ఇంటర్వ్యూలో సగర్వంగా చెప్పారు మజ్‌రూహ్. ఆయన మాటలలో కొంత అహంభావం ధ్వనించినా ఆయన అన్న మాటలల్లో అసత్యం లేదేమో.

ఓ.పి.నయ్యర్ కెరీర్ ఆరంభదశలో 'ఆర్‌పార్'. 'మిస్టర్ అండ్ మిసెస్ 55.' సి.ఐ.డి వంటి చిత్రాలలో మజ్‌రూహ్ రాసిన పాటలు సంచలనం సృష్టించడమే కాక నేటికీ హిందీ చిత్ర సంగీత ప్రేమికుల ప్రశంసలు అందుకుంటూనే ఉన్నాయి. సి.ఐ.డి. చిత్రంలోని 'ఓ లేకే పెహలా పెహలా ప్యార్. భర్ కే ఆంఖోఁ మేఁ ఖుమార్' పాట ఇప్పటికే మోగుతూనే ఉంది. ఖయ్యామ్ సంగీత దర్శకత్వంలో మజ్‌రూహ్ రాసిన 'శామ్ – గమ్ కీ కసమ్' అనే గజల్ ఖయ్యామ్ కు ఎంతో పేరు తెచ్చింది. 'ఫుట్ పాత్' అనే చిత్రం కోసం రాసిన ఆ గజల్ ను తలత్ మొహమూద్ పాడారు.

లక్ష్మీ కాంత్ ప్యారేలాల్ జోడీని సంగీత దర్శకులుగా నిలబెట్టిన 'దోస్తీ' చిత్రంలో మజ్‌రూహ్ రాసిన పాటలన్నీ అపూర్వ ప్రజాదరణ పొందాయి. రాహీ మన్ వా దుఖ్ కీ చింతా క్యూం సతాతేహై.' 'కోఈ జబ్ రాహ్ న పాయే.' 'చాహూంగా మైఁ తుజే సాంజ్ సావేరే' వంటి పాటలు 'దోస్తీ' చిత్రాన్ని మ్యూజికల్ హిట్ చేశాయి.

ఉషాఖన్నా తొలిసారిగా సంగీత దర్శకత్వం వహించిన 'దిల్ దేకె దేఖో' చిత్రంలో టైటిల్ సాంగ్ 'దిల్ దేకే దేఖో' తో సహా పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి.

ఉర్దూ పదభూయిష్టమైన 'దస్తక్' లోని 'హమ్ హైఁ మతా యే కూ ఛావో భాజార్ కీ తరహ్' వంటి శాస్త్రీయ బద్ధమైన గజల్ రాసిన మజ్‌రూహ్ 'కారవాన్' లోని 'పియా తూ అబ్ తో ఆజా' వంటి స్పీడ్ యుగం పాట కూడా రాశారు. 'యా దోంకీ బారాత్' లో 'చురాలియా హై

తుమ్ నే జో దిల్ కో' పాట రాసిన మజ్‌రూహ్ 'కయామత్ సె కయామత్ తక్' చిత్రంలో 'పాపా కహతే హైం బడా నామ్ కరేగా' పాట కూడా రాశారు.

సినిమా పాటలలో అటు కవిత్వం పేరిట ఎవరికీ అర్థం కాని మాటలు గుప్పించకుండా ఇటు 'వ్యాపారం' పేరిట అర్థం పర్థం లేని పదాలతో పాటను నింపకుండా, సరళమైన పదాలతో పదిమంది పెదవులపై సులువుగా మెదిలే కవిత్వంతో సినీ గీతాలు సృష్టించారు మజ్‌రూహ్ సుల్తాన్‌పురి.

గీత రచయితగా దాదాపు యాభై సంవత్సరాల కెరీర్ లో 330 కి పైగా చిత్రాలలో పాటలు రాశారు మజ్‌రూహ్. భౌతికంగా వృద్ధాప్యం వచ్చినా, భావాలు మాత్రం నిత్య యౌవనంతో నింపగల మజ్‌రూహ్ సుల్తాన్‌పురి వయస్సు 74 సంవత్సరాలు.

అభిరుచులు మారినా, సంగీత తత్వం మారినా అత్యంత సుదీర్ఘకాలం పాటల రచయితగా మజ్‌రూహ్ తన ప్రత్యేక స్థానంలో కొనసాగుతూనే ఉన్నారు.

కేవలం ఆర్థిక అవసరాల వత్తిడివల్ల, భద్రతాయుత జీవనం కోసం, ధనార్జన ధ్యేయంతోనే సినీ కవిగా మారినప్పటికీ మజ్‌రూహ్ తన కవిత్వ విలువలను కోల్పోలేదు.

"రాజీ పడక తప్పలేదు. దర్శక నిర్మాతలకు కవిత్వం అక్కర్లేదు. మాటల గారడీ కావాలి అయినా పూర్తిగా దిగజారిపోకుండా నా స్థాయిని కాపాడుకుంటూ అందరికీ నచ్చే అన్ని రకాల పాటలూ రాశాను. నేను సినీ రంగంలో అడుగుపెట్టి ఉండకపోతే కటిక దారిద్ర్యంతో కష్టాల పాలయ్యే వాడ్ని.' అంటారు మజ్‌రూహ్.

వెరైటీ గీతాల మేటి రచయితగా మాత్రమే గాక, దాదాఫాల్కే అవార్డు అందుకున్న ప్రప్రథమ సినీ గీత రచయితగా భారత సినీ చరిత్రలో మరపు రాని మజ్‌రూహ్ సుల్తాన్‌పురి.

– మాగాపు దుర్గ

★★★

COMMENTS